సాక్షి
జగిత్యాల
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

ధర్మపురిలో లక్ష్మీపూజలు



అద్దాల మండపంలో పూజలు

ధర్మపురి: దీపావళి సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం మొదటి రోజు అద్దాల మండపంలో ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ మంత్రోచ్ఛరణలతో లక్ష్మీపూజలు చేశారు. సోమవారం సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు సేవ, మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ చేస్తారు. ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, అర్చకులు తదితరులున్నారు.

దీపావళికి కొత్త కాంతులు తేవాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టర్ బి సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: దీపావళి జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు తేవాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని సూచించారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురిలోని ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించారు.

ఆలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



టీఎన్జీవో అధ్యక్షుడికి అంజన్న ప్రసాదం అందజేత

మల్యాల: ఆలయ ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీ కోసం కృషి చేయాలని కొండగట్టు దేవస్థానం ఆలయ ఉద్యోగులు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను కోరారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయనను కొండగట్టు ఆలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి అంజన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్జీవో ఉపాధ్యక్షుడు రాగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడుపై చెట్టు



మోడుపై పెరిగిన చెట్టు

కోరుట్ల: మోడు చిగురించడం కొత్త కాదు.. కానీ ఓ మోడుపై ఏకంగా చెట్టు పెరిగిన వైనం వింత గొలుపుతోంది. కోరుట్ల మండలం మోహన్‌రావుపేట శివారులో ఓ సరుగు చెట్టు మోదువారింది. మళ్లీ అది చిగురించి ఇదిగో ఇలా.. మొక్కగా మారింది.

వెలుగుల దీప్తి.. ఆలోచనల స్ఫూర్తి





జగిత్యాలటౌన్: కోటి వెలుగుల క్రాంతి. కొత్త ఆలోచనలకు స్ఫూర్తి దీపావళి. కష్టాలు అనే చీకట్లను తొలగించే వేడుక. చెడుపై మంచి సాధించిన విజయంతో సంబరాలు జరుపుకొనే వెలుగుల తారాజువ్వల మాలిక. నేటి దీపావళి వేడుకలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధం అయ్యారు. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో ప్రత్యేక పూజలు, నివాసాలు, ఆలయాల్లో నోములు, వ్రతాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీపావళి సందర్భంగా మార్కెట్లు కిక్కిరిశాయి. బంతిపూలు, గుమ్మడికాయలు, ఇతర పూజాసామగ్రి అమ్మకాలతో రద్దీగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల వద్ద సందడి నెలకొంది. కిలో చొప్పున విక్రయిస్తుండగా.. ధరలు ఆకాశాన్ని అంటున్నాయని చెబుతున్నారు. జిల్లాకేంద్రంలోని యావర్‌రోడ్డు, అంగడిబజార్, మార్కెట్ ప్రాంతాలన్నీ రకరకాల, రంగురంగుల దివ్వెల విక్రయాలతో బిజీగా మారిపోయాయి.

– వివరాలు 8లో

మళ్లీ..అదే తీరు

- దాడులకు తెగబడుతున్న ఇసుక అక్రమ రవాణాదారులు
- పక్షం రోజుల వ్యవధిలో రెండు సంఘటనలు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
- 'రెవెన్యూ'పై ఒత్తిడి పెంచుతున్న రాజకీయ నాయకులు

➡ పదిహేను రోజుల క్రితం.. కోరుట్ల పట్టణ శివారులో ఇసుక అక్రమ రవాణాదారు ఓ ఆర్ఐ, ముగ్గురు వీఆర్ఏలపై దాడికి దిగి మామూళ్ల ప్రస్తావన తెస్తూ దూషించాడు. ఈ ఘటన జరిగిన ఐదు రోజుల వరకూ రెవెన్యూ అధికారులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అతికష్టంపై మోహమాటానికి ఫిర్యాదు చేసినా.. అంతలోనే రెవెన్యూ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తి ఎడారి దేశానికి వెళ్లిపోయాడు.

➡ రెండు రోజుల క్రితం కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి సమీపంలో ఓ ఇసుక డంప్ నుంచి లారీలు, టిప్పర్లతో ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. తమనే అడ్డుకుంటారా..? అని సదరు అక్రమ రవాణాదారులు గొడవ చేసి.. సిబ్బందిపై దాడి చేసి.. వారిని తోసేసి ఇసుకతో లారీలు, టిప్పర్లను దర్జాగా తీసుకెళ్లారు. ఈ విషయమై దాడికి గురైన సిబ్బంది రెవెన్యూ అధికారులకు తెలిపితే 'పోనీలే'..అంటూ రాజీ పడటం విశేషం.



కథలాపూర్ మండలం బొమ్మెన శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

కోరుట్ల: ఈ రెండు సంఘటనల్లోనూ రెవెన్యూ ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరి కలవరం రేపుతోంది. రాత్రి..పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవడానికి కింది స్థాయిలో పనిచేసే సిబ్బంది అధికారుల తీరుతో అభద్రత భావంతో ఆందోళన చెందుతున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులు దాడులకు పాల్పడుతున్నా.. ఫిర్యాదు చేయడంలో చూపుతున్న ఉదాసీనతకు 'మామూళ్ల మత్తు' కారణమా.. లేక రాజకీయ ఒత్తిళ్ల ఫలితమా..? అనే విషయం తేలడం లేదు. ఈ రెండు సంఘటనలు జరిగిన వెంటనే కోరుట్ల, కథలాపూర్ సరిహద్దుల్లోని సిరికొండ, బొమ్మెన, నాగులపేట, సంగెం ఏరియాల్లోని వాగుల్లో కనీసం గట్టి ఏర్పాట్లు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారా.. అంటే అదీ లేదు. ఓ వైపు రెవెన్యూ సిబ్బందిపై వరుస దాడులకు తెగబడుతూనే.. మరోవైపు యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా లారీలు, టిప్పర్లతో కోరుట్ల నుంచి జగిత్యాల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ వైపు తరలిస్తున్నారు.

ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు..?

ఇసుక అక్రమ రవాణాను క్షేత్రస్థాయిలో అడ్డుకోవాల్సిన కింది స్థాయి సిబ్బంది దాడుల భయంతో విధుల నిర్వహణపై అనాసక్తితో ఉండగా.. పైస్థాయి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో నలిగిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కోరుట్ల, కథలాపూర్ మండలాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది కీలక నేతలు ఈ ఇసుక అక్రమ రవాణాకు వెన్నుదన్నుగా ఉంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. ఒకవేళ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుపడిన వెంటనే కీలకనేతల ఫోన్‌లు రావడంతో తప్పనిసరై వదిలేయాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే తమ సిబ్బందిపై దాడులు జరుగుతున్నప్పటికీ.. పట్టింపులేని ధోరణితో రాజీబాటను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. చివరికి కొంతమంది అధికారులు 'నలుగురితో నారాయణ' అన్న చందంగా అమ్యామ్యాలకు ఆశపడి నిర్లిప్తంగా ఉండక తప్పనిసరి పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇసుక అక్రమ రవాణాతో ఓ వైపు భూగర్భజలమట్టం పడిపోయే ప్రమాదం పొంచి ఉండటంతోపాటు..ప్రభుత్వానికి రావాల్సిన ఖజానాకు పెద్ద ఎత్తున గండిపడుతోందన్న మాట వాస్తవం.

కాంగ్రెస్ పాలనపై లండన్‌లో ఎన్నారైల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్నారై బీఆర్‌ఎస్‌ఎల్ యూకే సభ్యులు

రాయికల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 22 నెలలు గడుస్తున్నప్పటికీ హామీలు అమలు చేయడం లేదంటూ ఆదివారం లండన్‌లోని ఎన్నారై బీఆర్‌ఎస్‌ఎల్ యూకే ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. మన కాళేశ్వరం, మన హైదరాబాద్, మన రైతులను కాపాడుకోవాలని కోరుతూ ప్రదర్శన చేశారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎఫ్‌టీసీ మాజీ చైర్మన్ కుర్మాచలం అనిల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉంటే.. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. ఎన్నారై బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షులు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు నవపేట్ హరీ, సత్యమూర్తి, చినుముల రవి, కుమార్, అడ్వైజరీ బోర్డు వైస్‌చైర్మన్ గణేశ్, మల్లారెడ్డి, సురేష్, జాఫర్, ఐటీ మీడియా పీఆర్ రవి ప్రదీప్, సంయుక్త కార్యదర్శులు నవీన్, ప్రశాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దళితకాలనీల్లో కనిపించని అభివృద్ధి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మూడోవార్డులో సమస్యలు తెలుసుకుంటున్న వసంత

రాయికల్: పట్టణంలోని దళితకాలనీలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. పట్టణంలోని మూడో వార్డును బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22నెలలు పూర్తయినా దళితవార్డుల్లో నయా పైసా అభివృద్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో దళితవాడలకు ప్రత్యేక నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, రాయికల్ కో–ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, మాజీ కౌన్సిలర్లు మారంపెల్లి సాయికుమార్, శ్రీరాముల సత్యనారాయణ, నాయకులు వినోద్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జగిత్యాలటౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని, రైతులకు అండగా నిలవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వరికోతలు ప్రారంభమైన దృష్ట్యా వసతులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. రైతులకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, ఎంఏ.చౌదరి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాలలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాలకు చెందిన 62 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.15 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాలకు పల్లె దవాఖానాలు మంజూరు చేశామని, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. అధికార పార్టీతో ప్రతిపక్షానికి చెందిన ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయడం కొత్తకాదన్నారు. కొందరు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, నాయకులు సురేందర్‌రావు, ముకుందం, రవీందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, మహేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

సారంగాపూర్: ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులుగా నియామకం అయినవారు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల పదవీకాలం మూడేళ్లు ఉంటుందని, ఆలయానికి కొత్త శోభ తీసుకొచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, జగిత్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలంగూరి దామోదర్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పాలకమండలి సభ్యులు చీర్నేని శ్రీనివాస్, యశోద రమేశ్, గుమ్మడి రమేశ్, పూడూరి గంగమణి, చల్లా లక్ష్మణ్, దేవనపెల్లి జగన్‌మోహన్, చెక్కపల్లి సత్తన్న, ఎనగంటి సతీశ్, చెట్టుపల్లి సత్యనారాయణ, చెన్న గంగాధర్, సామ్రాట్, భీమనాతి లవన్, అల్లెపు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో నిర్మాణానికి యత్నం

మల్యాల: ముత్యంపేట తుమ్మల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించగా గ్రామ పంచాయతీ అధికారుల ఫిర్యాదుతో ఎస్సై వెళ్లి ఆరా తీశారు. చెరువును ఆనుకుని ఉన్న రైతు భూమిలో వెంచర్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేయడంతో గ్రామ పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజన్నను దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి

- ఘనస్వాగతం పలికిన మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్
- పూర్ణకుంభ కలశంతో ఆలయ అర్చకుల స్వాగతం



వేములవాడ: ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడకు శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి ఆదివారం రాత్రి చేరుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే, ఈవో రమాదేవి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభ కలశంతో స్వామి వారికి స్వాగతం పలికారు. స్థానిక తెలంగాణచౌక్‌కు చేరుకున్న స్వామీజీ ప్రత్యేక రథంపై ఆసీనులయ్యారు. జేసీబీ సహాయంతో గజమాల వేశారు. ఒగ్గుడోలు, భజన మండలి కళాకారులు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. స్వామీజీని చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.



పెద్దమ్మ స్టేజీ వద్ద జిల్లాలోకి..

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి చేపట్టిన విజయ ధర్మ యాత్ర గంభీరావుపేట మండలం పెద్దమ్మస్టేజీ వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. బాసర నుంచి వస్తున్న స్వామీ యాత్రకు పెద్దమ్మస్టేజీ, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

మద్యం దుకాణాల టెండర్ల గడువు పెంపు

- ఈనెల 23 వరకు అవకాశం
- శనివారం వరకు 1,834 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.55.02కోట్ల ఆదాయం



జగిత్యాలక్రైం: జిల్లాలో 71 మద్యం దుకాణాలకు ప్రభుత్వం గడువు పెంచింది. ముందుగా ఈనెల 18న చివరి రోజుగా ప్రకటించడంతో శనివారం పొద్దుపోయేదాకా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తంగా 1,834 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల చొప్పున ప్రభుత్వానికి రూ.55.02కోట్ల ఆదాయం సమకూరింది. అయితే దీపావళి సెలవులతోపాటు శనివారం బీసీ సంఘాలు రాష్ట్ర బంద్ నిర్వహించడం.. బ్యాంకులకు సెలవు ప్రకటించడంతో సర్కారు దరఖాస్తులకు గడువు పెంచింది. దీని ప్రకారం.. ఈనెల 23వరకు టెండర్లు వేసేందుకు అవకాశం ఉంది. 2023–25కిగాను 2,636 దరఖాస్తులు రాగా.. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల ఫీజు చొప్పున ప్రభుత్వానికి రూ.52.72 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సారి 1,834 దరఖాస్తులు రాగా ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల చొప్పున రూ.55.02కోట్లు ఆదాయం వచ్చింది. గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తులు రానున్నాయి. ఈనెల 27న జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మద్యం షాపుల నిర్వాహకులను డ్రాపద్ధతిలో ఎంపిక చేయనున్నారు.

సహస్ర లింగాల ఆలయంలో పంచామృతాభిషేకం



జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారులోని సహస్ర వెయ్యి లింగాల ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి, ధనత్రయోదశి సందర్భంగా పార్వతి పరమేశ్వరులకు, లక్ష్మీనారాయణ స్వాములకు వేద పండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం, సహస్ర లింగాలకు రుద్రాక్షమాలలు అలంకరించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్పు కింద రెండెకరాలు సేల్‌డీడ్

- మాజీ ఉప సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు


చికిత్స పొందుతున్న జనార్దన్

ఇబ్రహీంపట్నం: అవసరం కోసం అప్పు తీసుకున్నందుకు ఉన్న భూమిని సేల్‌డీడ్ చేసుకున్నాడో వడ్డీ వ్యాపారి. సదరు వ్యాపారి బాధలు భరించలేక బాధితుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్‌లో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఎలేటి సుజాత భర్త జనార్దన్ నాలుగేళ్ల క్రితం మెట్‌పల్లికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఏడాది తర్వాత వడ్డీకి వడ్డీ కలిపి మొత్తం చెల్లించాలని వ్యాపారి డిమాండ్ చేశాడు. లేకుంటే భూమి రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించాడు. దీంతో గ్రామశివారులో తనకున్న రూ.60లక్షల విలువైన 82 గుంటల భూమిని సేల్‌డీడ్ చేసి ఇచ్చారు. ఆ సమయంలో రూ.11 లక్షల అప్పు ఇచ్చినట్లు లెక్క చెప్పగా.. జనార్దన్ మాత్రం నెలనెలా వడ్డీ ఇచ్చినట్లు చెబుతున్నాడు. తన భూమి తనకు రిజిస్ట్రేషన్ చేస్తే డబ్బులు చెల్లిస్తానని జనార్దన్ చెప్పగా.. సదరు వ్యాపారి రూ.10 వడ్డీ చొప్పున లెక్క చేసి రూ.25 లక్షలు కట్టాలని డిమాండ్ చేశాడు. దీంతో జనార్దన్ శనివారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుటుంబసభ్యులు వెంటనే మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఎస్సై అనిల్‌ను వివరణ కోరగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వెలుగుల దీప్తి.. ఆలోచనల స్ఫూర్తి

- చిమ్మచీకట్లను పారదోలే పండుగ
- నేడు దీపావళి



విద్యానగర్(కరీంనగర్): కోటి వెలుగుల కాంతి.. కొత్త ఆలోచనలకు స్ఫూర్తి దీపావళి. నిశీధి నిశ్శబ్దాన్ని బాణసంచాతో బెదరగొట్టి చిమ్మ చీకట్లను చెల్లాచెదురు చేసే ఆ సంబరం దీపావళికే సొంతం.

వెలుగుల పండుగ

'తమసోమా జ్యోతిర్గమయా' అనే ఉపనిషత్ వ్యాక్యానికి ఆచరణరూపం దీపావళి. దీపావళి పర్వదినానికి యుగాల చరిత్ర ఉంది. ఇల్లంతటినీ దీపాలతో అలంకరించేది ఈ పండుగ రోజు మాత్రమే. ఆధునికత ఎంతో పెరిగినా దీపావళి రోజు ప్రమిదలో వత్తి వేసి నూనె పోసి ఆ దీపాల్నే వెలిగిస్తాం.

ఇతర దేశాల్లో దీపావళి

జపాన్‌లో కోరా నాగోషి పేరుతో దీపాల పండుగను పితృదేవతల సంస్మరణార్థం జరుపుతారు. చైనాలో హయివో హోవా పండుగలో పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తారు. నేపాల్‌లో ఆహారం ఐదురోజుల పండుగ. మొదటిరోజు కాకుల పండుగ, రెండో రోజు కోతుల పండుగ, మూడోరోజు ఆవుల పండుగ, నాల్గోరోజు దీపాలు వెలిగించి బాణసంచా పేలుస్తారు. చివరిరోజు ఆడపడుచుల పండుగ. ఇజ్రాయిల్ వారి స్వాతంత్ర్య వీరుడు మెకాచ్చిన్ స్మృత్యర్థం హనుకా అనే దీపోత్సవం జరుపుతారు. ఈజిప్టులో ఓ సిరీస్ మరణానికి చిహ్నంగా ఇంటింటా దీపాలు వేలాడగడతారు. అమెరికాలో నవంబరు 1న హాల్‌వీన్ అనే పేర దీపావళి వంటి పండుగ జరుగుతోంది. క్రైస్తవులు జరుపుకునే క్యాండిల్ ఫెస్టివల్ దీపావళి లాంటిదే. ముస్లిం దేశాల్లోనూ దీపావళి పండుగ ఉన్నది. మహ్మద్ పైగంబరు నూతన సంప్రదాయాన్ని స్థాపించి మక్కాకు తిరిగి వెళ్లిన రాత్రికది సూచిక. దీనిని షబ్ ఎ బారత్ అంటారు. ఆ రోజు బాణసంచా పేల్చారట.

వివిధ రాష్ట్రాల్లో..

రాష్ట్రాల వారీగా దీపావళి గురించి చెప్పుకుంటే గుజరాత్‌లో లక్ష్మీపూజ, గణపతిపూజ, కర్నాటకలో బలిపాడ్య పండుగ, బెంగాల్, ఒడిశాలో కాళీపూజ, శక్తిపూజ, ఇతర రాష్ట్రాల్లో గోవర్ధనపూజ, యమ ద్వితీయ, భయ్యదూజ్ పండుగలు దీపావళితోనే ముడిపడి ఉన్నాయి. దీపావళి ముందు రోజును నరక చతుర్దశిగా దీన్ని పిలుస్తున్నారు.

టపాసులతో భద్రం

విద్యానగర్(కరీంనగర్): దీపావళి అంటేనే భిన్నమైన పండుగ. వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ బాణాసంచా కాల్చడానికి ఉత్సాహం చూపుతారు. కాగా అతి ఉత్సాహంలో టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తతో ప్రమాదాలను కోరి తెచ్చుకుంటూ ఆస్పత్రుల పాలవుతుంటారు. ముఖ్యంగా పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్తలు పాటించాలి.

అత్యవసర ఫోన్ నంబర్లు	
ఫైర్ స్టేషన్	101
అంబులెన్స్	108
పోలీస్ కంట్రోల్ రూం	100

భారీ శబ్దాల బాంబులు

ప్రస్తుతం దీపావళి అంటే బాంబులు, టపాసుల పేలుళ్లతో వీధులన్నీ దద్దరిల్లిపోతున్నాయి. హైడ్రోజన్, సుత్తిలీ, లక్ష్మి, శివాజీ, డబుల్ సౌండ్స్, త్రిబుల్ సౌండ్స్ వంటి పేర్లతో భారీ శబ్దాలు పుట్టించే బాంబులు తయారవుతున్నాయి. ధాం.. ధాం అంటూ పేలే బాంబుల మోతలతో చెవులు దిమ్మెక్కెతున్నాయి. పరిమితికి మించిన శబ్దాలను విని, కాలిన గాయాలకు చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగినా జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక జీవితాంతం బాధపడుతూనే ఉంటారు. ఈ పరిస్థితులు రాకుండా తగిన జాగ్రత్తలతో పండుగను జరుపుకోవడం ఉత్తమం.



టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు

- నాణ్యమైన బ్రాండ్లకు చెందిన బాణాసంచా కొనుగోలు చేయాలి. రాకెట్లు, ఆకాశంలోకి దూసుకెళ్లే టపాసులను గుడిసెలు, గడ్డివాములు లేని ప్రదేశాల్లో కాల్చాలి.
- కాకరకొవ్వొత్తులు, విష్ణు చక్రాలు, భూచక్రాల వంటివి శరీరానికి దూరంగా ఉంచి కాల్చడం మంచిది. రాకెట్లు కాల్చేటప్పుడు వాటిని సీసాలో పెట్టి నిటూరుగా ఉండేలా సరి చూసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించాలి. చిన్నారులు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండాలి.

స్వగ్రామానికి మృతదేహాలు


ప్రకాశ్(ఫైల్)

రామడుగు/మేడిపల్లి: ఉపాధి కోసం ఒకరు.. ఉన్నత చదువుల కోసం మరొకరు విదేశాలకు వెళ్లి.. ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, వారి మృతదేహాలను ఆదివారం స్వగ్రామాలకు తీసుకొచ్చారు. వివరాలు.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎలగుందుల ప్రకాశ్ (35) కొద్దిరోజులుగా దుబాయ్‌లో కంపెనీలో కాకుండా కలివెల్లిగా జీవనం సాగించాడు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు, బీఆర్‌ఎస్ నాయకులు పూడురి మల్లేశం, దుబాయి ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సభ్యులు చిలుముల రమేశ్‌కు తెలిపారు. ఈక్రమంలో రమేశ్ సేవా సమితి అధ్యక్షుడు రవిడేవిడ్‌కు తెలియజేయడంతో దుబాయ్‌లోని ఇండియన్ అసోసియేషన్ వారితో మాట్లాడారు. దీంతో ప్రకాశ్ మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకురాగా, పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..


మహేందర్‌రెడ్డి (ఫైల్)

లండన్‌లో ఈనెల 3న గుండెపోటుతో చనిపోయిన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన ఏనుగు మహేందర్‌రెడ్డి (26) మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన మహేందర్‌రెడ్డి విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతడి తండ్రి రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ మేడిపల్లి మండల అధ్యక్షుడు కావడంతో పెద్దసంఖ్యలో ప్రజలు, ప్రముఖులు మహేందర్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం

చందుర్తి(వేములవాడ): బతుకమ్మ ఆట చూసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు 20 రోజులకు పాడుబడిన వ్యవసాయబావిలో కుళ్లిన స్థితిలో కనిపించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టేల తిరుపతి (30) గత నెల 29న సద్దుల బతుకమ్మ ఆట చూసి వస్తానని తల్లి భాగ్యవ్వకు చెప్పి వెళ్లాడు. 24 గంటలు గడిచినా కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో అదే నెల 30న భాగ్యవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా జోగాపూర్ పక్క గ్రామం కిష్టంపేటకు చెందిన పూడూరి బాపురావు వ్యవసాయ బావిలో కుళ్లిన స్థితిలో తిరుపతి మృతదేహం లభ్యమైంది. బాపురావు చిన్న కుమారుడు మహేశ్ బావికి సమీపంలో గేదెను కట్టేసేందుక వెళ్లగా కుళ్లిన మృతదేహంపై షర్టు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా తిరుపతి కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేక బావిలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు, గ్రామస్తులు భావిస్తున్నారు.